క్లుప్తంగా

స్పాట్ డెలివరీ ట్యాంకులు శుభ్రం చేయండి



మస్తానయ్య దర్గా ఆవరణలో సౌకర్యాలపై ఆరాతీస్తున్న కమిషనర్ మల్లికార్జున

గుంతకల్లుటౌన్: పట్టణంలోని స్పాట్ డెలివరీ నీటి ట్యాంకులను క్రమం తప్పకుండా చేయాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున వాటర్‌వర్క్స్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఉదయం ఆయన పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఇంజనీరింగ్, వాటర్‌వర్క్స్ సిబ్బంది మస్టర్‌ను పరిశీలించారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించవద్దన్నారు. స్పాట్ డెలివరీ ట్యాంక్‌ల మరమ్మతులంటీ పూర్తి చేయాలన్నారు. ఈఎల్ఎస్ఆర్(ఓవర్‌హెడ్) ట్యాంకులను కూడా మూడువారాలకోసారి శుభ్రం చేయాలన్నారు. అనంతరం ఆయన శానిటేషన్ అధికారులతో కలిసి మస్తానయ్య దర్గా ఆవరణాన్ని పరిశీలించారు. వచ్చే నెలలో ఉరుసు సందర్భంగా వేలాదిగా తరలివచ్చే భక్తాదులకు అందించాల్సిన సౌకర్యాలపై ఆరాతీశారు. డీఈ హేమచంద్ర, ఏఈ శ్రీకాంత్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డిలు పాల్గొన్నారు.

బియ్యం, బేడలు అధిక ధరలకు విక్రయించొద్దు



కార్డుదారులకు బియ్యం అందజేస్తున్న ఆర్డీఓ రవీంద్ర

గుంతకల్లుటౌన్: ప్రజలకు బియ్యం, కందిబ్యాళ్లను అధిక ధరలకు విక్రయించవద్దని ఆర్డీఓ రవీంద్ర వ్యాపారస్థులకు సూచించారు. మంగళవారం స్థానిక డీఎంఎం గేట్‌రోడ్ ఇల్లూరు కేదార్ షాపు వద్ద పౌరసరఫరా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బియ్యం ప్రత్యేక కౌంటర్‌ను ఆర్డీఓ ప్రారంభించారు. ప్రభుత్వ నిర్ణయించిన ధర ప్రకారం తెల్లరేషన్ కార్డుదారులకు సోనామసూరి బియ్యాన్ని 1 కేజీ రూ.48 చొప్పున 10 కేజీలను అందజేస్తామన్నారు. కందిబ్యాళ్లను 1 కేజీ రూ.130కే ఇస్తామని, అవకాశాన్ని తెల్లరేషన్‌కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తహసీల్దార్ బి.రాము, సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

సజావుగా ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న మేనేజర్

గుంతకల్లుటౌన్: మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం వార్డు వలంటీర్ పోస్టుల భర్తీకి సంబంధించి ఇంటర్వ్యూలు సజావుగా జరిగాయి. మొత్తం 13 పోస్టులకు గానూ 58 మంది దరఖాస్తు చేసుకోగా 44 మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు మున్సిపల్ మేనేజర్ రంగనాథం తెలిపారు. మెప్మా టీపీఆర్‌ఓ మోహన్,సీఓ మధు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



ముస్లిం మతపెద్దలతో కలిసి ప్రార్థనలు నిర్వహిస్తున్న ఫయాజ్‌బాషా

తాడిపత్రి అర్బన్: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వైఎస్సార్‌సీపీ నాయకుడు, 2వ వార్డు కౌన్సిలర్ హీరాపురం ఫయాజ్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని స్థానిక ఓగేటి రంగన్న ఫంక్షన్ హాలు సమీపంలో ప్రజల తాగునీటి సౌకర్యార్థం వేస్తున్న బోరు పనులను ఫయాజ్‌బాషా ప్రారంభించారు. ముందుగా కాలనీలోని ఇంటింటికీ వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నారు. కొందరు తమ సమస్యలను వివరించారు. వీటిపై అధికారులతో చర్చించి సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు చైర్మన్ షాషావలి, వైస్ చైర్మన్ మహబుబ్‌బాషా, ప్రభుత్వ సర్ఖాజీ హయత్‌ఖాద్రీ, మున్వర్, హాజీవలి, రియాజ్, షబ్బీర్, చవ్వా రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

21న మెగా కంటి వైద్య శిబిరం

గుత్తి: పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో ఈ నెల 21న ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు గేట్స్ డైరెక్టర్ వీకే వాణి తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చిన వారికి పరీక్షలతోపాటు ఆపరేషన్లు ఉచితంగా చేయిస్తామని, ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

కరోనా కట్టడికి చర్యలు



శానిటైజర్ పిచికారీ చేస్తున్న వలంటీర్ చాంద్‌బాషా



పెద్దపప్పూరు: కరోనా విపత్కర సమయంలో వలంటీర్లు యోధుల్లా పని చేశారు. తమకు అప్పజెప్పిన పనులతోపాటు స్వచ్ఛందంగా అనేక కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో ముచ్చుకోటకు చెందిన వలంటీర్ చాంద్‌బాషా ఒకరు. కరోనా బాధితులకు సేవలందించడంతోపాటు కరోనా ప్రబలకుండా నిత్యం గ్రామ పుర వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడంతో పాటు శానిటైజేషన్ చేపట్టాడు. అప్పట్లో ఉపాధి కోసం అరటికాయలు కోయడానికి బీహార్ నుంచి వచ్చిన వలస కూలీలు లాక్‌డౌన్ విధించడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వలంటీర్ వారికి మాస్కులతోపాటు నిత్యావసరాలు అందించాడు. లాక్‌డౌన్ ముగిసిన వెంటనే వారి స్వగ్రామాలకు క్షేమంగా పంపాడు.

ధైర్యం చెప్పేవాడు..



కరోనా సమయంలో నేను చాలా ఆందోళన చెందా. అసలు ఇంటి నుంచి బయటకు రావాలంటే భయంగా ఉండేది. అలాంటి సమయంలో వలంటీర్ చాంద్‌బాషా నిత్యం ఇంటి వద్దకు వచ్చి ధైర్యం చెప్పేవాడు. కరోనా విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేసేవాడు. మా వీధిలో శానిటైజేషన్ చేయడంతోపాటు నిత్యావసరాలు అందించాడు. కరోనా గండం నుంచి బయటకు పడ్డానంటే వలంటీర్ సేవలతోనే. –నాగమ్మ, ముచ్చుకోట

పేదల అభ్యున్నతే సీఎం జగన్ లక్ష్యం

• ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి



కొజ్జేపల్లిలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి

గుత్తి రూరల్: నిరుపేదల అభ్యున్నతే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కొజ్జేపల్లిలో ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేకు వైఎస్సార్‌సీపీ నాయకులు మేళతాళాలు, తప్పెట్లతో ఘన స్వాగతం పలికి పూలమాలలు, శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన ప్రతి గడప వద్దకూ వెళ్లి నాలుగేళ్లలో ప్రజలకు అందిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వైవీఆర్ మాట్లాడుతూ పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే సంకల్పంతోనే నవరత్న పథకాలను ప్రారంభించారన్నారు. నవరత్న పథకాల ద్వారా నిరుపేదలకు సాయం చేస్తుంటే ప్రజల సొమ్ము పప్పు, బెల్లాల్లా పంచుతూ రాష్ట్రాన్ని మరో శ్రీలంక చేస్తున్నాడని ఏడ్చిన బాబు, పవన్ వారు అధికారంలోకి వస్తే జగన్ అందిస్తున్న దానికన్నా రెట్టింపు పథకాలను ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఏపీలో ప్రజల ఇంటి వద్దకే వెళ్లి సంక్షేమ పథకాలను అందిస్తున్న వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులపై బాబు, పవన్ ఇద్దరూ అనుచితంగా మాట్లాడుతున్నారన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ఏ విధంగా పని చేస్తున్నాయో ప్రజలు ఆలోచించాలని ఎమ్మెల్యే సూచించారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గుంతకల్లు మునిసిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ సునీలా యాదవ్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ మల్లయ్యయాదవ్, చెవుల రాముయాదవ్, మహాలింగ, హాజీ మలంగ్ బాబా, చంద్ర, మధు, గాదిలింగ, నెట్టికంటయ్య, స్టోర్ డీలర్ కృష్ణమూర్తి, రామ్‌దొడ్డి, మాజీ సర్పంచ్ మహేశ్వరప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి సచివాలయ రూరల్ కన్వీనర్ సుభాష్ రెడ్డి పాల్గొన్నారు.

పక్కాగా ఓటరు జాబితా సవరణ

పామిడి: మండలంలో ఓటరు జాబితా సవరణ పక్కాగా చేపట్టాలని తహసీల్దార్ ఆర్‌వీ సునిత బాయి సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ సభా భవనంలో జరిగిన బూత్ లెవెల్ ఆఫీసర్ల (బీఎల్‌ఓ) అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి డబుల్ ఎంట్రీలు, డిలీషన్లపై పక్కా ఆధారాలు సేకరించాలన్నారు. ఈ నెల 20 నుంచి నెలరోజుల పాటు సర్వే చేపట్టాలన్నారు.

గుంతకల్లుటౌన్: ఓటరు జాబితా సవరణ పక్కాగా చేపట్టాలని గుంతకల్లు ఆర్డీఓ రవీంద్ర బీఎల్‌ఓలకు సూచించారు. మంగళవారం కౌన్సిల్‌హాల్‌లో ఓటరు జాబితా సవరణపై బీఎల్‌ఓలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. బూత్‌లెవెల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి జాబితా మేరకు ఓటర్ల వివరాలను పరిశీలించాలన్నారు. కమిషనర్ మల్లికార్జున, తహసీల్దార్ బి.రాము, ఈడీటీ సువర్ణ, మున్సిపల్ టీపీఎస్ అబ్దుల్ సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్య



రాధాకృష్ణారెడ్డి(ఫైల్)

యాడికి: భోగాలకట్ట గ్రామంలో మంగళవారం ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాలు.. గ్రామానికి చెందిన రైతు రాధాకృష్ణారెడ్డి(39) పిల్లలను చదివించేందుకు అనంతపురానికి మకాం మార్చాడు. తనకున్న 10 ఎకరాల పొలంలో గతేడాది పత్తి, పప్పుశనగసాగు చేశాడు. గతేడాది పంట పెట్టుబడి, పిల్లల(కుమారుడు, కుమార్తె) చదువు కోసం రాయలచెరువులోని బ్యాంకులో రూ1.20 లక్షలు, మరో ముగ్గురి దగ్గర రూ.3.30 లక్షలు అప్పు చేశాడు. గతేడాది ఆశించిన దిగుబడి రాలేదు. అప్పు ఇచ్చిన వారి నుంచి ఒత్తిళ్లు అధికమయ్యాయి. ఈ నేపథ్యంలో అనంతపురం నుంచి స్వగ్రామానికి వచ్చిన అతడు సోమవారం రాత్రి దూలానికి ఉరేసుకున్నాడు. మృతుడి భార్య శ్రీవాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు.

బాస్కెట్‌బాల్‌పై అవగాహన

బుక్కరాయసముద్రం: స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ఆర్డీటీ సౌజన్యంతో స్పెయిన్ బార్సిలోనా క్లబ్‌కు చెందిన జవుమా నేతృత్వంలో మరో 11 మంది క్రీడాకారులు బాస్కెట్‌బాల్ క్రీడపై మంగళవారం అవగాహన కల్పించారు. ఏటా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు క్రీడా పోటీల్లో మెలుకువలు నేర్పిస్తుంటామని క్రీడాకారులు తెలిపారు. స్పెయిన్ క్రీడాకారుడు జవుమా, పాఠశాల హెచ్‌ఎం వసుంధర, పీడీ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వీకే ఆశయాలు కొనసాగిద్దాం

తాడిపత్రి అర్బన్: కమ్యూనిస్టు నేత వీకే ఆదినారాయణరెడ్డి ఆశయాలను కొనసాగిద్దామని సీపీఐ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం వీకే ఆదినారాయణెడ్డి 26వ వర్ధంతిని స్థానిక నెహ్రూపార్కులో నిర్వహించారు. వీకే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రంగయ్య, పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్, సహాయ కార్యదర్శి రామాంజి, మండల కార్యదర్శి నాగరంగయ్య తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం సీపీఐ రాష్ట్ర నేత వీకే ఆదినారాయణ రెడ్డి వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా వీకే చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ మండల కార్యదర్శి రామదాసు, సీనియర్ నేతసూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

పెద్దవడుగూరు: ఏ.తిమ్మాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నేత గోవర్ధన్‌యాదవ్ తల్లి ముత్యాలమ్మ(94) మృతి చెందింది. విషయం తెలుసుకున్న తాడిపత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డి కుమారుడు సాయిప్రతాప్‌రెడ్డి మంగళవారం గ్రామానికి చేరుకుని ముత్యాలమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఆదర్శ ఉద్యోగులకు అభినందన

గుంతకల్లుటౌన్: డీజిల్‌ను ఆదా చేయడంతో పాటు అత్యధిక ఆదాయం రావడానికి కృషి చేసిన పలువురు డ్రైవర్లు, కండక్టర్లను డీఎం నారాయణస్వామి అభినందించారు. మంగళవారం డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆదర్శ ఉద్యోగులైన కండక్టర్లు రామాంజనేయులు, నరేష్‌కుమార్, అహమ్మద్, డ్రైవర్ కృష్ణంరాజు, గ్యారేజీ సిబ్బంది గోవిందప్ప, రమణ, మస్తాన్‌కు ప్రశంసా పత్రాలతో పాటు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు.

నేడు ఎమ్మెల్యే, కలెక్టర్ రాక

పామిడి: జీ కొట్టాల గ్రామంలో బుధవారం ఉదయం జరిగే జగనన్న సురక్ష కార్యక్రమానికి కలెక్టర్ ఎం గౌతమి, ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి రానున్నట్లు ఎంపీడీఓ డీ ప్రభాకర్‌నాయక్ మంగళవారం తెలిపారు. అనంతరం పామిడిలో సీసీరోడ్లను ప్రారంభిస్తారన్నారు.

అభివృద్ధి బాటలు



గుప్తా కాలనీలో నూతనంగా నిర్మించిన 40 అడుగుల రోడ్డు



పామిడి నెహ్రూకాలనీలో పూర్తయిన రోడ్డు

- పామిడిలో వీధివీధికి రోడ్లు
- ఎమ్మెల్యే వైవీఆర్ చొరవ
- నేడు సీసీరోడ్లు ప్రారంభం

పామిడి: అభివృద్ధికి చిహ్నాలు రోడ్లు. మండలకేంద్రంలో గతంలో రోడ్లు అధ్వానంగా ఉండి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే వారు. దీనికి డ్రైనేజీలు లేకపోవడంతో రోడ్లపైనే మురుగునీరు పారేది. దీంతో వాహదారులు, పాదచారులు, స్థానికులు అవస్థలు పడేవారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. దీనికి గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి చొరవ తోడవడంతో మండల కేంద్రంలో వీధివీధిలో రోడ్ల నిర్మాణం జరిగింది. దీంతో వాహనదారులు, పాదచారులు, స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

దశాబ్దాల సమస్యకు పరిష్కారం..

మండలకేంద్రంలో దశాబ్దాల తరబడి సరైన రోడ్లు లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడేవారు. వీకే ఆదినారాయణరెడ్డికాలనీ, గుప్తాకాలనీ 40 ఫీట్ రోడ్డు, నెహ్రూకాలనీ ఏళ్ల తరబడి మట్టిరోడ్లు ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఆయా కాలనీల్లో సీసీరోడ్ల నిర్మాణంపై దృష్టి సారించారు. మండల కేంద్రంలోనే 15 చోట్ల దాదాపు 3 కి.మీ దూరం సీసీరోడ్ల నిర్మాణం పూర్తి చేశారు. ఇందుకోసం దాదాపు రూ.5 కోట్లు ఖర్చు చేశారు. జిల్లా కలెక్టర్ గౌతమి, ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి సీసీరోడ్లను ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ డీ ప్రభాకర్‌నాయక్ తెలిపారు.

గుప్తా కాలనీ రోడ్డు చాలా బాగుంది



గుప్తాకాలనీలో 40 అడుగుల రోడ్డు చాలా బాగుంది. ఇది పామిడికే తలమానికంగా మారింది. గతంలో పట్టణంలో ఇది ప్రధాన రహదారిగా ఉండేది. ఆక్రమణలతో కుంచించుకుపోయి ఎదురెదురుగా రెండు ఆటోలు సైతం వెళ్లలేనంతగా ఉండేది. ప్రస్తుతం సీసీరోడ్డు నిర్మించడంతో సమస్య పరిష్కారమైంది. –పీ వరప్రసాద్, పామిడి

ఇబ్బందులు తొలగాయి



నెహ్రూకాలనీ రోడ్డు ఆక్రమణలతో ఇరుకుగా ఉండేది. దీంతో పాదచారులు, వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులకు గురయ్యేవారు. వర్షం వస్తే బురదలో ఫీట్లు చేయాల్సి వచ్చేది. ఎమ్మెల్యే వైవీఆర్ చొరవతో ఆక్రమణలు తొలగించి పూర్తిగా రోడ్డు నిర్మించారు. దీంతో ఇబ్బందులు తొలగిపోయాయి. – లక్ష్మీదేవి, నెహ్రూకాలనీ, పామిడి

సంక్షేమమే లక్ష్యంగా జగనన్న పాలన



సమస్యలు తెలుసుకుంటున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రి: రాష్ట్ర ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం గన్నెవారిపల్లి పంచాయతీ సచివాలయం- 2 పరిధిలో తన సోదరుడు కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డితో కలసి పర్యటించారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానికులు పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకురాగానే వెంటనే పరిష్కరించాలని ఆయన సచివాలయ సిబ్బందిని కోరారు. గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు మంజూరు కావాలంటే నాయకుల పలుకుడి అవసరమయ్యేదని, కానీ తమ ప్రభుత్వంలో అర్హుడై ఉంటే ఎవరి సిఫారసు లేకుండానే అందుతున్నాయన్నారు. జెడ్పీటీసీ రమణమ్మ, ఎంపీటీసీ రవికుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పల్లె నాగేశ్వర్‌రెడ్డి, నాయకులు ప్రదీప్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రామశేఖర్, ఉమ్మడి గురుప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి

శింగనమల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ పథకాలు అందించాలన్న ఉద్దేశంతోనే జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభించారని ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి అన్నారు. మంగళవారం శింగనమలలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశారన్నారు. అర్హులై ఉండి పథకాలు అందని వారికీ కూడా అందించాలనే జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టారని తెలిపారు. ప్రజలకు 11 రకాల సేవలను ఉచితంగా అందిస్తున్నారన్నారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి, మండల స్పెషలాఫీసర్ సుధారాణి, ఎంపీపీ యోగేశ్వరి, వైస్ ఎంపీపీ విజయ, సర్పంచ్ నాగమునెమ్మ, ఎంపీటీసీ కురబ ఉమా, ఈశ్వరమ్మ, ఎంపీడీఓ నిర్మలాకుమారి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఎన్‌వి నారాయణ, చెన్నకేశవులు, ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ నాయక్, మండల కో-ఆప్షన్ మెంబర్ ఆలీ పాల్గొన్నారు.

గార్లదిన్నె: కమలాపురం, కనంపల్లి గ్రామవాలయాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. మండల స్పెసలాఫీసర్ శాంతి, తహసీల్దార్ ఉషారాణి, ఎంపీడీఓ తేజోత్స్న ఆయా గ్రామాల్లో 454 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి, ఎంపీపీ వెంకటనారాయణ, సర్పంచులు సంజమ్మ, అంజినమ్మ, ఎంపీటీసీలు గీతాభవాని, ధనుంజయ, ఈఓఆర్డీ వెంకటలక్ష్మి, సీఎస్‌డీటీ ధనలక్ష్మి పాల్గొన్నారు.

యల్లనూరు: దంతలపల్లి గ్రామ సచివాలయంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎంపీడీఓ వీరరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 132 మందికి సర్టిఫికెట్లను అందించారు. ఉప సర్పంచు వెన్నపూస రాజేశ్వరరెడ్డి, డీటీ శ్వేత తదతరులు పాల్గొన్నారు.

పుట్లూరు: అరకటివేముల, కందికాపుల గ్రామ సచివాలయాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి ఓబుళమ్మ లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఎంపీడీఓ యోగానందరెడ్డి, డీటీ మల్లేష్, ఈఓఆర్డీ ఆనంద్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: రోటరీపురం, సిద్దరాంపురం గ్రామ సచివాలయంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా 475 మందికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. మండల ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్, ఎంపీడీఓ విజయభాస్కర్, సర్పంచులు కొండన్న, కామాక్షి, కల్పన ఈఓఆర్డీ దామోదరమ్మ, జేసీఎస్ మండల కన్వీనర్ బయపరెడ్డి, ఏపీఎం మద్దిలేటి పాల్గొన్నారు.

పామిడి: స్థానిక పామిడమ్మ ఆలయంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఏపీ అర్బన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ కుమ్మెత లక్ష్మి, కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూదన్‌రెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ బోయ రామచంద్ర, పట్టణ సచివాలయాల కన్వీనర్ బీ ఆసిఫ్, ఎంపీడీఓ డీ ప్రభాకర్‌నాయక్ 645 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. సీఎస్‌డీటీ శ్రీరాములు, ఈఓ చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు జోజోడే కుమార్, 10వ వార్డు కన్వీనర్ మస్తానయ్య పాల్గొన్నారు.

గుత్తి రూరల్: అబ్బేదొడ్డి గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి, ఎంపీడీఓ చిట్రా శ్రీనివాసులు, తహసీల్దార్ మహబూబ్ బాషా లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.సర్పంచ్‌లు లావణ్య, రత్నమ్మ, ఈఓఆర్డీ శివాజీరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, రామాంజనేయులు, ఎంపీటీసీ లాలెప్ప పాల్గొన్నారు.

గుత్తి: మున్సిపాలిటీలోని 6వ వార్డు సచివాలయంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 492 మంది సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, కమిషనర్ శ్రీనివాసులు, వైస్ చైర్‌పర్సన్లు బిందె వరలక్ష్మి, పద్మలత, కౌన్సిలర్లు బుసా రూపావతి, ఫరూక్, వాల్మీకి శివరాం, వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు గురు ప్రసాద్ యాదవ్, బళ్లారి రాజ కుమార్‌రెడ్డి, గుత్తి టౌన్ సచివాలయ కన్వీనర్ రంగస్వామి, వార్డు ఇన్‌చార్జ్ లు హమాలి రామాంజి, సునీల్, గోరా మాబు పాల్గొన్నారు.

తాడిపత్రి: హుస్సేనాపురం, ఊరుచింతల సచివాలయాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రంగారావు లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

పెద్దపప్పూరు: దేవునిఉప్పలపాడులో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యురాలు రమాదేవి,మాజీ ఎంపీపీ రామ్మూర్తి రెడ్డి, ఎంపీడీఓ రామకృష్ణ లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈఓఆర్డీ కమలాబాయి, డిప్యూటీ తహసీల్దార్ మహబూబ్ బాషా పాల్గొన్నారు.

యాడికి: వేములపాడు, రాయలచెరువు నం:1 గ్రామ సచివాలయాల్లో మంగళవారం జగనన్నసురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో 440 మందికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. సర్పంచులు ఓంకారమ్మ, తలారి అరుణ,వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, సీనియర్ నేత బాలా రమేష్‌బాబు, వైస్ ఎంపీపీ హసీనాబేగం, ఎంపీటీసీ కొమ్మా గౌరి, వైస్ సర్పంచు రత్నమ్మ, నాయకులు నాగేష్, రషీద్, వెంకటనారాయణరెడ్డి, అమర్‌నాథరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, పురుషోత్తం రెడ్డి, రసూల్, రమానందరెడ్డి, సాంబశివుడు, తహసీల్దార్ అలెగ్జాండర్, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: చిట్టూరు, రాంపురం సచివాలయాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 325 మందికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. సర్పంచులు పతాక ధనలక్ష్మీ, సుధాకర్‌రెడ్డి, తహసీల్దార్ నాగభూషణ, ఎంపీడీఓ కుళ్లాయిస్వామి చిత్రచేడు ఎంపీటీసీ , డీటీ వెంకటేశ్వరమ్మ, ఆర్ఐ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగభూషణ, నాగిరెడ్డి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కసాపురం రోడ్డు ఆర్‌యూబీ నిర్మాణానికి ప్రతిపాదనలు



రైల్వే, ఆర్‌అండ్‌బీ అధికారులతో చర్చిస్తున్న కమిషనర్ మల్లికార్జున

గుంతకల్లుటౌన్: నిత్యం రద్దీగా మారిన కసాపురం రోడ్డు విస్తరణతో పాటు రైల్ అండర్ బ్రిడ్జి(ఆర్‌యూబీ) నిర్మాణం కోసం అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నారు. ఇందులో భాగంగా మంగళవారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, టీపీఎస్ అబ్దుల్ సత్తార్, ఆర్‌అండ్‌బీ డీఈ శ్రీధర్‌రెడ్డి, ఏఈ సత్యనారాయణ, రైల్వే సెక్షన్ ఇంజినీర్ సుధాకర్ కసాపురం రోడ్డు బ్రిడ్జి వద్ద క్షేత్రస్థాయి పరిశీలించారు. మాస్టర్‌ప్లాన్ ప్రకారం కసాపురం రోడ్డును 60 అడుగుల రోడ్డుగా విస్తరించడంతోపాటు ప్రస్తుతం ఉన్న రైల్వే బ్రిడ్జి నుంచి 30 మీటర్ల దూరంలో కొత్త ఆర్‌యూబీ(ఇన్ అండ్ అవుట్) నిర్మాణానికి తయారు చేసిన డిజైన్ల ఆధారంగా తనిఖీలు చేపట్టామని అధికారులు వెల్లడించారు. ఆర్‌యూబీలో వర్షపునీరు నిల్వ లేకుండా చేపట్టాల్సిన చర్యలు, మురుగునీటి మళ్లింపునకు నిర్మించాల్సిన డ్రైనేజీలు, రైల్వే ఎలక్ట్రికల్ లైన్లు, మున్సిపల్ వాటర్ సప్లయ్ మెయిన్ పైప్‌లైన్ల మార్పు, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చేపట్టాల్సిన చర్యలపై చర్చించినట్లు అధికారులు వెల్లడించారు. మూడుశాఖల అధికారులు తనిఖీల అనంతరం ప్రతిపాదనలను సిద్ధం చేసి డీఆర్‌ఎం ద్వారా ఉన్నతాధికారులకు పంపనున్నట్లు వారు వెల్లడించారు.

సీఐపై చర్యలు తీసుకుంటే ఉద్యమిస్తాం

తాడిపత్రి అర్బన్: శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగానే సీఐ అంజుయాదవ్ అలా వ్యవహరించిందని, ఆమెపై చర్యలు తీసుకుంటే ఉద్యమిస్తామని తాడిపత్రి యాదవ సంఘం నాయకులు హెచ్చరించారు. స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. సీఐ బీసీ మహిళ అయినందు వల్లే జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ రాద్ధాంతం చేస్తున్నాడన్నారు. అసలు సీఐ తప్పేంటని, శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తుంటే పోలీసులు ప్రేక్షక పాత్ర వహించాలా అని ప్రశ్నించారు. యాదవ సంఘం నాయకులు ధాక రాజు, లింగమయ్య, శివకుమార్, మనోజ్‌కుమార్, నాగసుబ్బరాయుడు, లక్ష్మణ్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్ బ్యాగ్ మిస్

యల్లనూరు: మల్లాగుండ్ల పంచాయితీ కార్యదర్శి ప్రవల్లిక హ్యాండ్ బ్యాగు పోగొట్టుకుపోయిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్కూటీపై మల్లాగుండ్లకు వెళుతుండగా పాతపల్లి-గడ్డంవారిపల్లి మధ్యలో హ్యాండ్ బ్యాగ్ పడిపోయిందన్నారు. అందులో ఆధార్ కార్డ్, ఏటీఎం, పాన్ కార్డు, చెక్ బుక్, పంచాయతీ సీల్‌తో పాటు రూ.15 వేలు నగదు ఉన్నాయన్నారు.